ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
విజయనగరం
జిల్లా వార్తలు
మంగళవారం 21 జనవరి 2025



నేడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనిత సమీక్ష

విజయనగరం కలెక్టరేట్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి, హోంమంత్రి వంగలపూడి అనిత మంగళవారం జిల్లాకు వస్తున్నట్లు కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. ఉపాధి హామీ, పంచాయతీరాజ్, రెవెన్యూ సదస్సులు తదితర అంశాలపై సమీక్షిస్తారని వెల్లడించారు. అధికారులంతా హాజరుకావడంతో పాటు పూర్తి సమాచారంతో సమావేశానికి రావాలని ఆదేశించారు.

మత్తు వదలరా?



ఎస్.కోటలో పట్టుబడిన గంజాయి (ఫైల్)



- గంజాయి స్వాధీనం కేసుల్లో యువకులే అధికం
- ఒడిశా సరిహద్దు నుంచి జిల్లా మీదుగా రవాణా
- చూసీచూడనట్లు వ్యవహరించిన గత వైసీపీ ప్రభుత్వం
- పూర్తిగా అరికట్టలేక పోతున్న కూటమి ప్రభుత్వం

● గంజాయిని పీలుస్తున్న ముగ్గురు యువకులను కొద్దిరోజుల కిందట శృంగవరపుకోట పోలీస్‌లు పట్టుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేశారు. పుణ్యగిరి కొండ సమీపంలోని పొదల్లో దాక్కొని గంజాయిని సేవిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీస్‌లు వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరంతా తక్కువ వయసు కలిగిన యువకులే.

● ఇరవై రోజుల కిందట కొత్తవలస సంత ప్రాంతంలో గంజాయి సేవిస్తున్న నలుగురు యువకులను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 2 కేజీల 700 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసిన పోలీస్‌లు జైలుకు పంపించారు. కాగా అంతకు వారం ముందు ఇదే మండలం మంగళపాలెం వద్ద గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు ఓ వ్యక్తిపై దాడికి దిగారు. అతని వద్దనున్న ఫోను, కొంత సొమ్మును లాక్కొన్నారు. ఈ దాడి గంజాయి మత్తులో జరిగినట్లు తెలిసింది.

● వేపాడ మండల పరిధిలోని ఓ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో రాత్రి సమయంలో కొందరు యువకులు గంజాయిను పీల్చుతున్నారు. ప్రహరీ పక్కనుంచి గంజాయి వాసన కలిగిన పొగ బయటకు రావడంతో ఆటుగా వెలుతున్న ఆ గ్రామ ప్రజాప్రతినిధొకరు గమనించారు. గంజాయిని పీల్చుతూ కనిపించిన యువకులను మందలించడంతో అందులోని ఓ యువకుడు ఏకంగా దాడికు దిగాడు. గత నెలలో ఈ ఘటన జరిగింది.

శృంగవరపుకోట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):

-ఇలా గంజాయిని పీల్చుతూ పోలీసులకు పట్టుబడిన వారు కొందరే. నిత్యం వినియోగిస్తూ జల్సా చేస్తున్నవారికి కొదవ లేదు. జిల్లాలో ఇక్కడ, అక్కడ అని కాదు ఎక్కడబడితే అక్కడ గంజాయి దొరకడమే దీనికి కారణం. చిన్న యవసులోనే గంజాయి రవాణా, వాడకం, అమ్మకానికి అలవాటు పడుతున్నారు. ఆర్థిక అవసరాల కోసం మత్తులో నేరాలు చేస్తున్నారు. ఇది తప్పు అని ఎవరైనా చెబితే విచక్షణ కోల్పోతున్నారు. దాడులకు దిగుతున్నారు. కత్తులు, బ్లేడులు పట్టుకొని వెంటపడుతున్నారు. మత్తులో పట్టుబడుతున్న వారిలో 80 శాతం మంది 16 నుంచి 35 ఏళ్లలోపు వున్న వారే కావ డం ఆందోళన కలిగిస్తోంది. గత వైసీపీ పాలకుల పుణ్యమా అని ఎక్కువ మంది గంజాయి పీల్చేందుకు అలవాటు పడ్డారు. ఒకప్పుడు దీని రవాణా ద్వారా సంపాదించిన సొమ్ముతో లగ్జరీ జీవతాన్ని అనుభవించేందుకు చూసిన యువత ఇప్పుడు దీన్నించి వచ్చే మత్తును (మిగతా 8వ పేజీలో...)

తల్లిదండ్రులూ ఒకసారి గమనించండి..



ఇంట్లో తరచూ డబ్బులు పోతున్నప్పుడు ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానాలు చెప్పడం. చికాకు పడడం. ఒంటరిగా ఫోన్‌లో గంటలు గంటలు మాట్లాడడం, పగలు ఎక్కువగా నిద్రపోవడం, రాత్రి చురుగ్గా వుండడం, శరీర శుభ్రత పాటించకపోవడం, రోజురోజుకు బలహీనంగా కనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తే కౌన్సిలింగ్ ఇప్పించాల్సిందే. తల్లిదండ్రులు పిల్లల కోసం కొంత సమయం కేటాయించాలి. వారి స్నేహితుల దినచర్యను గమనించాలి. ఖర్చులకు ఇస్తున్న సొమ్మును ఎలా వాడుతున్నారో కనిపెడుతుండాలి. మత్తు పదార్థాలు నేరుగా మెదడు, నాడీ వ్యవస్థలపై ప్రభావం చూపుతాయి. నరాలు బలహీనపడతాయి. కిడ్నీలు పాడవుతాయి. క్రమంగా అవయవాలను నిర్వీర్యం చేస్తాయి. ఈ విషయాలన్నీ గుర్తు పెట్టుకోండి.

-డాక్టర్ ఎస్.వి సత్యశేఖర్, ఎం.ఎస్. జనరల్ సర్జన్

రాజాం సమీపంలో గంజాయి నిల్వలు..

రాజాం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11న రాజాం పట్టణానికి కూతవేటు దూరంలో బాలికవివలస రోడ్డు లో నలుగురు యువకులు గంజాయి సేవిస్తూ పట్టుబడ్డారు. పోలీసు లు తనిఖీ చేస్తుండగా తారసపడ్డారు. వారు వాటర్ బాటిళ్ల సాయంతో గంజాయి సేవిస్తున్నారు. వారిని విచారించగా పాలకొండకు చెందిన వ్యక్తి అందించినట్టు తెలిపారు. పోలీసులు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా.. జీఎంఆర్ ఐటీ కాలేజీ సమీపంలోని తోటలో 1.5 కిలోలు దాచినట్టు పేర్కొన్నాడు. దీంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా రాజాం పట్టణం చుట్టుపక్కల ఉన్న ఖాళీ ప్రాంతాలు, రియల్‌ఎస్టేట్ వెంచర్లలో సాయంత్రం 5 గంటలు దాటితే వాహన సమూహాలు కనిపిస్తాయి. అయితే అంతా మద్యం తాగేవారు అనుకుంటున్నారు కానీ గంజాయి బాబులేనని తెలుస్తోంది.

సిగరెట్లలో కూడా..



యువతలోనూ చాలా మంది సిగరెట్లు తాగుతున్నారు. అయితే నిశితంగా పరిశీలిస్తే ఆ సిగరెట్లలో గంజాయి ఉంటోంది. ఆ మత్తులో యువత జోగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. సాయంత్రం 5 గంటలు దాటితే సమీప కొండ ప్రాంతాలు, లేఅవుట్లలో ఖాళీ ప్రదేశాలకు ద్విచక్రవాహనాలు చేరుతుంటాయి. అందరూ 18 నుంచి 20 సంవత్సరాలు ఉన్నవారే. అక్కడ గంజాయి తాగేందుకు గుమిగూడుతున్నారు.

ప్రజా విశ్వాసమే లక్ష్యం

- తాజా పరిణామాలపై సమీక్షించే అవకాశం
- నేడు టీడీపీ జిల్లా సర్వసభ్య సమావేశం



విజయనగరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలు కావస్తున్న నేపథ్యంలో జరుగుతున్న టీడీపీ జిల్లా సమావేశంపై ఆ పార్టీ శ్రేణులు అమితాసక్తి చూపుతున్నాయి. పార్టీ బలోపేతంపై భవిష్యత్ కార్యాచరణ ఏ విధంగా ఉంటుందో తెలుసుకోవాలని ఉవ్విళ్లూరుతున్నాయి. పార్టీ పరిస్థితులపై తమ అభిప్రాయాలను జిల్లా నేతల దృష్టికి తీసుకువెళ్లాలని కార్యకర్తలు భావిస్తున్నారు. ప్రజా విశ్వాసాన్ని పొందే దిశగా పార్టీని మరింత బలంగా ముందుకు తీసుకువెళ్లాలనేది ప్రధాన అంశంగా తెలుస్తోంది. అయితే ఏడు నెలల పాలనలో ప్రభుత్వం ఏం చేసింది... ప్రభుత్వం, పార్టీ మధ్య సమన్వయం ఎలా ఉంది.. సభ్యత్వ నమోదు కోటికి చేరుకున్న నేపథ్యం... ఫిబ్రవరి నెలలో సంస్థాగత ఎన్నికలు.. నామినేటెడ్ పదవుల కొత్త జాబితాలు.. తదితర అంశాలే అజెండాగా తెలుగుదేశం పార్టీ జిల్లా సర్వసభ్య సమావేశం మంగళ వారం నగరంలోని మెసానిక్ టెంపుల్లో ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుంది. ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనితతో పాటు జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కూడా హాజరుకానున్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు హాజరుకావాలని ఇప్పటికే పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున ఆహ్వానం పంపారు.

● పార్టీకి, ప్రభుత్వానికి మధ్య సమన్వయంలో కొన్ని లోపాలు తలెత్తుతున్నాయని అధిష్ఠానానికి నివేదిక వెళ్లిందని సమాచారం. ఈ పరిస్థితిలో సమన్వయ సాధనకు పలు నిర్ణయాలు తీసుకోనున్నారు.

● ఊహించని విధంగా సభ్యత్వ నమోదు కోటి దాటింది. పైగా ప్రమాద బీమాను రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచారు. సభ్యత్వ నమోదుకు వస్తున్న స్పందన చూసి మరో వారం రోజులు పొడిగించారు. ఈ అంశంపై చర్చించే అవకాశం ఉంది.



త్వరలో నామినేటెడ్

దావోస్ దేశ పర్యటనలో వున్న టీడీపీ అధినేత చంద్రబాబు మరో నాలుగైదు రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌కు రానున్నారు. నెలాఖరు లేదా వచ్చే నెల తొలి వారంలోగా మిగతా నామినేటెడ్ పోస్టుల జాబితాలను విడుదల చేయనున్నారు. మరోవైపు దేవస్థానాల కార్యవర్గాలూ నియామకం కావాల్సి ఉంది. ఏఎంసీది అదే పరిస్థితి. ఏడు నెలలు కావస్తున్నా పూర్తిస్థాయిలో నామినేటెడ్ పదవులు కేటాయించకపోవడం పట్ల పార్టీ శ్రేణుల్లో కొంత నిరాశ ఉంది. ఈ సమావేశంలో నామినేటెడ్ అంశం ప్రధానంగా చర్చకు రావొచ్చు.



గ్రామాల్లో సర్వే

చిన్న, సన్నకారు రైతులు పశుగ్రాసం పెంచడానికి ఆసక్తి చూపుతున్నారు. దీనిపై గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నాం. ఆసక్తి ఉన్న రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేసుకోవాలి. పాడి అభివృద్ధికి పశుగ్రాసం ఎంతో దోహదపడుతుంది.

- సీహెచ్ రామారావు, ఏపీవో, గజపతినగరం

పశుగ్రాసం సాగుకు భరోసా

- శత శాతం రాయితీతో పథకం అమలు
- గరిష్ఠంగా ఐదెకరాల్లో సాగుకు ప్రోత్సాహం

గజపతినగరం, జనవరి20(ఆంధ్రజ్యోతి): చిన్న, సన్న కారు పాడి రైతులకు బాసటగా ఉండేందుకు ప్రభుత్వం కొత్త విధానం తీసుకొస్తోంది. పశుగ్రాసం సాగుకు ఆర్థికంగా ఊతం ఇవ్వనుంది. గ్రాసం పెంపకం పథకానికి ఉపాధి హామీ నిధులు వెచ్చించనుంది. గరిష్ఠంగా ఐదు ఎకరాల్లో పశుగ్రాసం పెంచుకొనేందుకు అవకాశం ఉంది.

రైతుల్లో ఎక్కువ మంది వ్యవసాయానికి తోడుగా పాడిని చేపడుతుంటారు. గేదెలు, ఆవులు పెంచుతుంటారు. ఈఏడాది వర్షాలు కురవడంతో పశుగ్రాసానికి ఇప్పటివరకు పెద్దగా కొరత లేదు. వేసవిలో గ్రాసం కొరత తలెత్తితే అండగా ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. పశుగ్రాసం సాగుకు భరోసా ఇస్తోంది. లబ్ధిదారుల ఎంపిక కోసం సర్వే చేస్తోంది. కొత్త పథకం ద్వారా పచ్చి మేతను పాడి పశువులకు అందించవచ్చు. ఒక్కో మండలానికి 35నుంచి 45 ఎకరాలవరకు సాగుకు రైతులనుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఐదెకరాల లోపు భూమి ఉన్న ఎస్సీ, ఎస్టీ చిన్న కారు రైతులు ఈ పథకానికి అర్హులు. వీరికి ఖచ్చితంగా ఉపాధి జాబ్‌కార్డు ఉండాలి. అర్హులైన వారు సమీపంలోని పశు వైద్యులు, రైతుసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తుతో పాటు పొలానికి సంబంధించిన1బీకార్డు, ఆధార్, రేషన్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం నకలు కాపీలు జతచేయాలి. గ్రామసభ ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులు పశుగ్రాసం సాగుకు అర్హులుగా గుర్తిస్తారు.

నిధుల కేటాయింపు ఇలా..

పదిసెంట్లలో పశుగ్రాసం పెంపకానికి కూలి ఖర్చు కింద రూ.3వేలు, సామగ్రి కింద విత్తనం కొనుగోలుకు రూ.3,599 కలిపి రూ.6,599 చెల్లిస్తారు. 50సెంట్లలో పెంపకానికి వేతనం కింద రూ.15వేలు, విత్తన ఖర్చులకు రూ.17,992 అందజేస్తారు. ఉపాధి హామీ అధికారులు, పశువైద్యులు ధ్రువీకరించాకే రైతులకు బిల్లులు చెల్లిస్తారు. పశుగ్రాసం అందించేందుకు గ్రామస్థాయిలో సర్వే చేపట్టనున్నారు.

బిల్లలవలసలో డయేరియా

- 16 మందిలో లక్షణాలు

బొండపల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): బిల్లలవలస గ్రామంలో డయేరియా విజృంభించింది. 16 మంది వ్యాధి బారినపడ్డారు. ఈ నెల 17న పత్తిగుళ్ల దీపికలో డయేరియా లక్షణాలు కనబడడంతో విజయనగరం ఘోషాసుపత్రికి తరలించారు. అదే రోజు పత్తిగుళ్ల రాజశేఖర్, వెంపడాపు పైడితల్లిలో కూడా లక్షణాలు కనిపించడంతో చికిత్స కోసం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చేర్చారు. అయితే బొండపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ గ్రామంలో 24 గంటల వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఇంటింటా సర్వే చేపట్టారు. 8 మందికి డయేరియా లక్షణాలు ఉన్నాయని గుర్తించి చికిత్స అందజేశారు. వీరు కోలుకున్నప్పటికీ మరో ఐదుగురికి తాజాగా డయేరియా ప్రబలింది. దీంతో డీఎంఅండ్‌హెచ్‌వో జీవరాణి, తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు, ఎంపీడీవో గిరిబాల తదితరులు సోమవారం గ్రామంలో పర్యటించి పారిశుధ్య పనులకు ఆదేశించారు. తాగునీటి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించారు. ప్రస్తుతం డయేరియా అదుపులోనే ఉన్నట్టు డీఎంఅండ్‌హెచ్‌వో తెలిపారు.



ఇంటింటికీ వెళ్లి పరిస్థితి తెలుసుకుంటున్న వైద్య సిబ్బంది



రేపటి నుంచి జేఈఈ మెయిన్స్

- జిల్లాలో రెండు కేంద్రాల్లో నిర్వహణ
- హాజరు కానున్న 5,447 మంది విద్యార్థులు

6లో

సర్వే శాఖ అధికారుల పెన్ డౌన్

6లో

మూడు మద్యం దుకాణాలకు తాళాలు

- జామిలో రెండు.. భీమసింగిలో ఒక దుకాణం మూత
- బహిరంగంగా మద్యం సేవించడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన తహసీల్దార్
- ఆశ్చర్యపోయిన స్థానికులు

7

ప్రతి వినతినీ పరిష్కరించండి

- కలెక్టర్ అంబేడ్కర్
- పీజీఆర్ఎస్‌లో 183 వినతుల స్వీకరణ

7

ఇకపై స్మార్ట్‌గా..



- కొత్త విద్యుత్ మీటర్లు వచ్చేశాయ్
- వినియోగంపై వాట్సాప్‌కు సమాచారం
- తొలిదశలో వాణిజ్య సముదాయాల్లో ఏర్పాటు

6లో

కొనసాగుతున్న పోలీసు నియామక ప్రక్రియ

విజయనగరం క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం 14వ రోజు కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాల ప్రక్రియ కొనసాగింది. పీఎంటీ, పీఈటీ పరీక్షలకు 651 మంది పురుష అభ్యర్థులు హాజరుకాగా వారిలో 446 మంది తుది రాత పరీక్షకు అర్హత సాధించారు. ఎస్పీ వకుల్‌జిందాల్, ఏఎస్పీలు సౌమ్యలత, జి.నాగేశ్వరరావులు స్వయంగా పరిశీలించారు. ఈ ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నారు. అభ్యర్థులకు ముందుగా హాల్ టిక్కెట్లు పరిశీలించి మైదానంలోకి అనుమతిస్తున్నారు. అన్ని ధ్రువపత్రాలు పరిశీలించి సక్రమంగా ఉన్న వారిని మాత్రమే బయోమెట్రిక్ తీసుకుని పరీక్షలకు అనుమతించారు. నియామక ప్రక్రియలో డీఎస్పీలు వీరకుమార్, యూనివర్స్, రమణమూర్తి, బాపూజీ, టీఎన్ శ్రీనివాసరావు, థామస్‌రెడ్డి, ఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అభ్యర్థి నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్‌జిందాల్

ఇకపై స్మార్ట్‌గా..!

- కొత్త విద్యుత్ మీటర్లు వచ్చేశాయ్
- వినియోగంపై వాట్సాప్‌కు సమాచారం
- తొలిదశలో వాణిజ్య సముదాయాల్లో ఏర్పాటు


రాజాంలోని ఓ వాణిజ్య సముదాయంలో ఏర్పాటు చేసిన స్మార్ట్‌మీటర్

రాజాం రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి)

విద్యుత్ రంగంలో సాంకేతికంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. గతంలో ఉండే ఎనర్జీ మీటర్ల స్థానంలో హెచ్‌పీఎల్ ఇండియా కమ్ పుష్ బటన్ మీటర్లు వచ్చాయి. తాజాగా స్మార్ట్ మీటర్లు వాటి స్థానాన్ని ఆక్రమించుకుంటున్నాయి. కచ్చితమైన రీడింగ్‌తో పాటు సరఫరా తీరుతెన్నులు, అంకెలు కళ్లకు స్పష్టంగా కనిపించేలా వీటిని రూపొందించినట్టు సంబంధిత అధికారులు చెబుతున్నారు. వాణిజ్య సముదాయాలలో (కేటగిరి 2) షాపులకు వీటిని అమర్చే సమయంలో వినియోగదారుడి ఫోన్ నెంబర్, జీ మెయిల్ ఐడీని మీటర్ నెంబర్‌తో అనుసంధానం చేస్తున్నారు. ఫలితంగా ఏ నెలకా నెల రీడింగ్, విద్యుత్ ఛార్జీల సమాచారం వాట్సాప్ ద్వారా వచ్చేస్తుంది. తొలిదశలో వీటిని వాణిజ్య సముదాయాలు, రైస్ మిల్లులు, ఇతరత్రా హెచ్.టి. కనెక్షన్లకు అమర్చుతున్నారు. రెండో విడతలో గృహ లకు అమర్చేందుకు ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వినియోగదారులకు వీటిని ఉచితంగానే అందిస్తున్నారు.

● ఫోన్ నెంబర్‌తో అనుసంధానం..

మీటర్ అమర్చిన సమయంలో విద్యుత్ శాఖకు చెందిన సిబ్బంది వినియోగదారుడి ఫోన్ నెంబర్ తీసుకుంటారు. యజమాని పేరుతో పాటు అద్దెకు ఉంటున్న వారి నెంబర్‌ను విద్యుత్ శాఖ కార్యాలయంలోని సర్వర్‌తో అనుసంధానం చేస్తున్నారు. ప్రతినెలా ఒకటో తేదీన సంబంధిత వినియోగదారుల ఫోన్ నెంబర్‌కు వాట్సా ప్‌లో గడచిన నెలలో ఎంత విద్యుత్ వినియోగించారు? యూనిట్లు, చార్జీల వివరాలతో పాటు బిల్లు కూడా మెసేజ్ రూపంలో వస్తుంది. వాటిని పరిశీలించి వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా లేదా కార్యాలయాల్లో చెల్లించుకోవచ్చు.

ఎంతో మేలు..



స్మార్ట్ మీటర్ల అమరికతో వినియోగదారులకు ఎంతో మేలు కలుగుతుంది. ఇది పూర్తిగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ. జిల్లాలో తొలిదశలో ప్రభుత్వ కార్యాలయాలు, కేటగిరీ 2 పరిధిలోకి వచ్చే వాణిజ్య సముదాయాలు, కల్యాణ మండపాలు, మాల్స్, రైస్‌మిల్స్‌కు స్మార్ట్ మీటర్లు అమరుస్తున్నాం. వినియోగదారులు ఎన్ని యూనిట్లు విద్యుత్ వినియోగించారో ఫోన్‌కు వచ్చే లింక్ ద్వారా తెలుసుకోవచ్చును. తద్వారా బిల్లు ఎంత చెల్లించాలో తెలుసుకోవచ్చును. యజమానితో పాటు అద్దెకు ఉండే వారికి సైతం సమాచారం చేరుతుంది. భవిష్యత్తులో గృహాలకు కూడా స్మార్ట్ మీటర్లు అమర్చే ఆలోచనలో ఏపీఈపీడీసీఎల్ ఉంది.

-జి.సురేష్‌బాబు, ఏఈ, ఏపీఈపీడీసీఎల్

ఇవిగో ఉపయోగాలు..

ఇప్పటి వరకూ ఒక నెలలో విద్యుత్ వినియోగానికి సంబంధించి తరువాతి నెల మొదటి వారంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు రీడింగ్ తీస్తూ అక్కడే బిల్లును అందజేస్తున్నారు. ఇకపై రీడింగ్ తీసి బిల్లులు అందజేసే ప్రక్రియ ముగియనుంది. ఆ నెలలో వినియోగించిన యూనిట్ల మేరకు మెయిల్ లేదా వాట్సాప్‌కు మొత్తం సమాచారం చేరుతుంది. అలాగే గతంలో బిల్లు తీయడంలో సిబ్బంది జాప్యం చేయడం వల్ల కనీస యూనిట్లు దాటి సంఖ్య పెరిగిన సందర్భాలు చోటుచేసుకునేవి. దీని వల్ల నిర్ణీత యూనిట్లు దాటిన తరువాత యూనిట్ ధర పెరగడం వల్ల విద్యుత్ వినియోగదారుడిపై అదనపు భారం పడేది. ఇకపై ఈ పరిస్థితి తలెత్తే అవకాశమే లేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. అలాగే నెల రోజులకు సంబంధించి నమోదైన రీడింగ్ నెల మొదటి రోజునే వినియోగదారుడికి చేరడం వల్ల అదనపు యూనిట్లు భరించే ఇబ్బంది ఉండదు. పైగా స్మార్ట్ మీటర్ అమరిక వల్ల వినియోగదారుడికి ఎంతో లాభమని ట్రాన్స్ అధికారులు చెబుతున్నారు.

రేపటి నుంచి జేఈఈ మెయిన్స్



- జిల్లాలో రెండు కేంద్రాల్లో నిర్వహణ
- హాజరు కానున్న 5,447 మంది విద్యార్థులు

విజయనగరం కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి)

ఇంటర్ తరువాత ఐఐటీ, ఎన్ఐటీల్లో చేరేందుకు నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్ మొదటి సెషన్ పరీక్షలు ఈ నెల 22 నుంచి 30 వరకు జిల్లాలో జరుగనున్నాయి. ఈ నెల 22, 23, 24, 28, 29 తేదీల్లో రెండు షిఫ్టులలో పేపర్-1 (బీఈ, బీటెక్) ప్రవేశ పరీక్షలు జరుగనుండగా... 30న మధ్యాహ్నం పేపర్-2 బీఆర్క్ పరీక్ష నిర్వహిస్తారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. పరీక్షలకు మూడు రోజుల ముందుగా కేంద్రం, సమయం తదితర వివరాలతో కూడిన అడ్మిట్ కార్డులను విడుదల చేస్తారు. ఇలా 22 నుంచి 24వ తేదీ వరకు పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో అడ్మిట్ కార్డులను జారీ చేశారు. ఇంకా 28, 29, 30 తేదీల్లో పరీక్షలు రాసే వారి కార్డులను విడుదల చేయాల్సి ఉంది. జిల్లాలో రెండు కేంద్రాల్లో ఈ పరీక్ష జరుగనుంది. జిల్లా వ్యాప్తంగా 5,447 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ (చింతలవలస), ఐయాన్ డిజిటల్ జోన్ (గాజులరేగ) కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నారు. ప్రతి రోజు రెండు షిఫ్టులలో పరీక్షలు నిర్వహిస్తారు.

2 గంటల ముందే...

- జేఈఈ మెయిన్స్ అడ్మిట్ కార్డులు పొందిన విద్యార్థులు అందులో ఎన్‌టీఏ పొందుపరచిన నియమ, నిబంధలను క్షుణ్ణంగా చదవాలి. పరీక్ష సమయానికి రెండు గంటల ముందుగానే కేంద్రాలకు చేరుకోవలసి ఉంటుంది.
- పేపర్ -1 ఇంజనీరింగ్ ప్రవేశపరీక్ష మొదటి షిఫ్టు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో షిఫ్టులో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నారు. ఉదయం పరీక్షకు 7 గంటలకు, మధ్యాహ్నం పరీక్షకు ఒంటి గంటకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి.
- ఎన్‌టీఏ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న అడ్మిట్ కార్డు కింద భాగంలో ఇచ్చిన ఒక బాక్సులో కలర్ పాస్‌పోర్ట్ సైజు ఫొటోను అతికించాలి. ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో అప్‌లోడ్ చేసిన ఫొటోనే అతికించాల్సి ఉంటుంది. మరో బాక్సులో విద్యార్థి ఎడమ చేతి వేలిముద్ర వేయాలి. పక్కన ఉన్న మూడో బాక్సులో పరీక్ష కేంద్రంలోకి వెళ్లాక ఇన్విజిలేటర్ సమక్షంలో సంతకం చేయాలి.
- పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు సాధారణ వస్త్రాలను ధరించాలి. కాళ్లకు సాధారణ చెప్పులు ధరించాలి. ఆడపిల్లలకు తలపై పిన్నులు, క్లిప్పులను అనుమతించరు. ఎటువంటి ఆభరణాలూ ధరించి పరీక్షకు వెళ్లరాదని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. విద్యార్థులు పెద్ద పెద్ద గుండీలు ఉన్న షర్టులు ధరించరాదు.
- విద్యార్థులు తమ వెంట అడ్మిట్ కార్డుతో పాటు అటెండెన్స్ షీట్‌పై అతికించేందుకు మరో పాస్‌పోర్ట్ సైజు ఫొటోను తెచ్చుకోవాలి. బయోమెట్రిక్ హాజరు నమోదు చేయనున్నారు.
- ట్రాన్స్‌పరెంట్ వాటర్ బాటిల్‌తో పాటు బ్లూ లేదా బ్లాక్ కలర్ పాయింట్ పెన్ను తెచ్చుకోవాల్సి ఉంటుంది.
- దరఖాస్తు సమయంలో అప్‌లోడ్ చేసిన ఆధార్ లేదా పాన్ వంటివి ఒరిజినల్ కార్డులను విధిగా తీసుకువెళ్లాలి.

పదిలమే!

- మార్కెట్లో జోరుగా పది నాణెం వినియోగం
- ఫలితమిస్తున్న ఆర్బీఐ చర్యలు


వినియోగంలో ఉన్న పది నాణాలు

రాజాం రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నిన్న, మొన్నటి వరకు పది రూపాయల నాణెం చూస్తే జనం హడలిపోయేవారు. దాని వల్ల ఏదో ఇబ్బంది ఎదురవుతుందన్నంతగా బెదిరిపోయే వారు. కానీ ప్రస్తుతం పరిస్థితి మారింది. బహిరంగ మార్కెట్లో పది రూపాయల నాణెం మళ్లీ పరుగులు తీస్తోంది. గతంలో ఆర్బీఐ విడుదల చేసిన పది నాణాలు చాలా కాలంగా మార్కెట్లో చెలామణి కాలేదు. దీన్ని ఎవరికి ఇచ్చినా.. 'వద్దు' అనే పరిస్థితి ఉండేది. ఈ నాణాలకు చట్టబద్ధత ఉందని రిజర్వ్ బ్యాంక్ గతంలో ఎన్నిసార్లు ప్రకటనలు చేసినా వీటిని తీసుకునేందుకు ఎవరూ ఆసక్తి చూపేవారు కాదు. ప్రధానంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఇవి దాదాపుగా మూలకు చేరాయనే చెప్పాలి. అయితే ఇటీవల మార్కెట్లో చిల్లర సమస్య తీవ్రం కావడం... పది రూపాయల నోట్లు బాగా నలిగిపోయి.. కనుమరుగయ్యే పరిస్థితి నెలకొనడంతో ఆర్బీఐ తాజాగా పది నాణాలను భారీ స్థాయిలో విడుదల చేసింది. వ్యాపార లావాదేవీలలో వీటిని కచ్చితంగా తీసుకోవాల్సిందేనని ప్రకటించింది. బ్యాంకులు, ఇతర ఆర్థిక లావాదేవీలు నిర్వహించే సంస్థల వద్ద బోర్డులను ప్రదర్శించేలా చర్యలు చేపట్టింది. ఆ సంస్థల వద్ద ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నం చేసింది. దీంతో ఈ నాణాలు మార్కెట్లో పరుగులు తీస్తున్నాయి. నాణాలు వచ్చిన తొలిరోజుల్లో పెద్ద సంఖ్యలో సేకరించి.. దాచుకున్న వారంతా తిరిగి వాటిని వినియోగంలోకి తెస్తున్నారు.



ఓ బ్యాంకులో ఏర్పాటు చేసిన బోర్డు


చినభోగిలి రహదారి దుస్థితి ఇదీ

శంబర జాతరకు దారేది?

మక్కువ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్యదేవత, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన శంబర పోలమాంబ అమ్మవారి జాతరకు సమయం దగ్గర పడుతోంది. ఈ నెల 27, 28, 29 తేదీల్లో జాతర జరుగనుంది. ఈ ఉత్సవాలకు మన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి లక్షలాది భక్తులు వస్తుంటారు. ఈ ఏడాది జాతరకు వచ్చే భక్తులకు రహదారి కష్టాలు తప్పేలా లేవు. పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు పట్టణాల నుంచి మండల కేంద్రం మక్కువ మీదుగా శంబర గ్రామానికి చేరుకోవాల్సి ఉంటుంది. మక్కువకు వచ్చే మూడు రహదారులు పూర్తిగా అధ్వాన్న స్థితిలో ఉన్నాయి. సాలూరు నుంచి మామిడిపల్లి మీదుగా శంబర చేరుకోవడానికి, మక్కువ నుంచి కవిరిపల్లి మీదుగా శంబరకు వెళ్లేందుకు కొంత ఫర్వాలేదు. కానీ పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు నుంచి మక్కువ వెళ్లే రహదారులు గోతుల మయంగా మారాయి. చివరికి మక్కువకు వచ్చే ఆర్టీసీ బస్సులను సైతం నిలిపివేసిన పరిస్థితి ఏర్పడింది. ఇంత వరకు రోడ్ల మరమ్మతులు చేపట్టలేదు. దీంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. గతంలో సాలూరు-మక్కువ, చిన బోగిలి-మక్కువ రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు మధ్యలోనే చేతులెత్తేశారు. జాతర సమీపిస్తున్నందున పూర్తిస్థాయి లో రహదారులు నిర్మించలేకపోయినా.. కనీసం మరమ్మతులైనా చేపట్టాలని అధికారులను భక్తులు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం చేస్తా

- నూతన డీఎస్పీ భవ్య

బొబ్బిలి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సైబర్ నేరగాళ్ల ప్రభావం ఎక్కువగా ఉందని... వారి బారిన పడకుండా అన్ని వర్గాల వారిని అప్రమత్తం చేస్తానని బొబ్బిలి నూతన డీఎస్పీ గుండ్రే భవ్య రెడ్డి అన్నారు. పోలీసు శాఖలో చేరి... మొదటిసారి బొబ్బిలి డీఎస్పీగా సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. సైబర్ నేరగాళ్ల ఆటలు సాగకుండా ఉండేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. అందరినీ అప్రమత్తం చేయడం ద్వారా నేరగాళ్ల ఆట కట్టించవచ్చని అభిప్రాయపడ్డారు. మహిళల సంరక్షణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు. బాలికలకు ఎటువంటి అభద్రతా భావం లేకుండా గట్టి నిఘా పెడతామని భరోసా ఇచ్చారు. ఆకతాయిల ఆగడాలను అరికడతామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు చేపడతామని ఆమె తెలిపారు. ఇదిలా ఉండగా... కొత్తగా బాధ్యతలు స్వీకరించిన భవ్యకు బదిలీపై వెళుతున్న డీఎస్పీ పి.శ్రీనివాసరావు స్వాగతం పలికారు. సబ్ డివిజన్ పరిధిలో స్థితిగతులు, శాంతి భద్రతల పరిస్థితులను ఆమెకు వివరించారు.

కుటుంబ నేపథ్యం ఇదీ...

అన్నమయ్య జిల్లా రాయచోటి ప్రాంతానికి చెందిన భవ్య అనంతపురం జేఎన్‌టీయూలో బి.టెక్ చేశారు. తొలుత సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా, రైల్వేలో సెక్షన్ అధికారిగా, బ్యాంకులో పీఓగా ఉద్యోగాలు చేశారు. అనంతరం డీఎస్పీగా ఎంపికయ్యారు. ఆమె భర్త కేతిరెడ్డి సాయి సందీప్ ఆటో మొబైల్ ఇంజనీరుగా పనిచేస్తున్నారు. వీరికి చరణ్ తేజ అనే నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. భవ్య తండ్రి వెంకటరామిరెడ్డి ఉపాధ్యాయుడు. తల్లి చంద్రకళ వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగిని. సోదరి ప్రవల్లిక హైకోర్టు న్యాయవాదిగా ఉన్నారు. సోదరుడు త్రివిక్రమ రెడ్డి మెడిసిన్ చదువుతున్నట్లు ఆమె తెలిపారు.


నూతన డీఎస్పీ భవ్యకు స్వాగతం పలుకుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

పాఠశాల విద్యను పుట్టపర్తి సత్యసాయి విద్యాసంస్థల్లో పూర్తి చేసినట్టు డీఎస్పీ భవ్య చెప్పారు.

జాతీయ స్థాయి పోటీలకు తాండ్రంగి విద్యార్థులు


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గరివిడి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22 నుంచి 26 వరకు బిహార్ రాష్ట్రం పాట్నా, ఝార్ఖండ్ రాష్ట్రం రాంచిలో జరుగనున్న జాతీయ సైక్లింగ్ పోటీలకు తాండ్రంగి ఉన్నత పాఠశాల విద్యార్థులు మన రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరంతా డిసెంబరు 21 నుంచి 23 వరకు కృష్ణా జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో బంగారు, రజత పతకాలను సాధించి... రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం కడలి రమేష్ కుమార్, పీడీ సత్యనారాయణ, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు కృష్ణంరాజు, పీవీఎల్ఎస్ కృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్థులు అభినందించారు.

సర్వే శాఖ అధికారుల పెన్ డౌన్

- ఉన్నతాధికారుల తీరుపై నిరసన

విజయనగరం, కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వే శాఖలోని గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో పనిచేస్తున్న అధికారులు నిరసన బాట పట్టారు. జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న సమీక్ష సమావేశాల్లో కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు వినియోగించే భాష, ఉపయోగించే పదాలు అభ్యంతరకరంగా ఉంటున్నాయని, అలాగే కష్టపడి పని చేస్తున్నా మెమోలు జారీ చేస్తున్నారని అంటూ సోమవారం గ్రామ, మండల సర్వేయర్లు అంతా పెన్ డౌన్ చేశారు. వాస్తవానికి మండలానికి ఒక గ్రామం చొప్పున ఎంపిక చేసి... పైలెట్ ప్రాజెక్టు కింద సోమవారం సర్వే ప్రక్రియ మొదలు పెట్టవలసి ఉంది. సర్వేయర్లు అందరూ పెన్‌డౌన్ చేయడంతో సర్వే కార్యక్రమం ప్రారంభం కాలేదు. ఈ నెల 18న కలెక్టరేట్ ఆడిటోరియంలో రెవెన్యూ సదస్సులు, రీసర్వేలో వచ్చిన వినతుల పరిష్కారం తదితర అంశాలపై రెవెన్యూ, సర్వే శాఖ అధికారులతో కలెక్టర్ అంబేద్కర్, జేసీ సేతుమాధవన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో కలెక్టర్ తమను కించపరిచేలా, హేళనచేస్తూ దుర్భాషలాడారంటూ సర్వే శాఖ అధికారులు వాపోతున్నారు. జిల్లాలోని 27 మండలాల్లో 90 శాతం పని పూర్తి చేశామని చెబుతున్నారు. అయినా జిల్లాలోని ఐదుగురు తహసీల్దారులు, ఇద్దరు సర్వే పరిశీలకులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం సరికాదని వారు ఆందోళన వ్యక్తం చేపట్టారు. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వినతిపత్రం కూడా పంపించారు. జిల్లా సర్వే శాఖ ఏడీకి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్, జేసీలు బేషరతుగా సర్వే ఉద్యోగులందరికీ క్షమాపణ చెప్పాలని, మెమోలను ఉపసహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.


పెన్‌డౌన్‌లో పాల్గొన్న సర్వే సిబ్బంది

రీసర్వేలో వచ్చిన వినతులను ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో పూర్తి చేయడానికి అవకాశం కల్పించాలని వినతిపత్రంలో కోరారు. తమకు న్యాయం చేయాలని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరావు చౌదరి, నాగేశ్వరరావులు కోరారు.

రేపు కబడ్డీ జట్ల ఎంపిక

గంట్యాడ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలోని మహిళలు, పురుషుల సీనియర్ కబడ్డీ జట్లల ఎంపిక బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు గంట్యాడ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్టు కబడ్డీ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 25, 26, 27 తేదీల్లో విశాఖలోని అక్కుపాలెంలో నిర్వహించనున్న పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు.

కోటి సభ్యత్వాలు గ్రేట్

విజయనగరం రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వాన్ని కోటి మందికి పైబడి స్వీకరించడం గ్రేట్ అని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సువ్వాడ రవిశేఖర్ అన్నారు. సోమవారం విజయనగరంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి సభ్యత్వ నమోదు, సంస్థాగత ఎన్నికల ప్రక్రియ క్రమం తప్పకుండా నిర్వహించడం దేశంలోని అన్ని రాజకీయ పార్టీల కంటే టీడీపీ ముందుంటుందన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదు చేసే వారికి బీమా సౌకర్యం కూడా కల్పిస్తోందన్నారు. 2022లో రూ.2 లక్షలు ప్రమాద బీమా ఉండేదని, తాజాగా దాన్ని రూ.5 లక్షలకు పెంచారన్నారు. సభ్యత్వ నమోదు విషయంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ చొరవ ఎనలేనిదన్నారు. తాజాగా నారా లోకేశ్‌ను డిప్యూటీ సీఎం చేయాలన్న డిమాండ్ తెరపైకి వచ్చిందని, దానికి తానూ మద్దతు పలుకుతున్నానని రవిశేఖర్ స్పష్టం చేశారు.

నేడు గురుకులంలో వర్క్‌షాప్

రేగిడి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉంగరాడ గురుకుల కళాశాలలో మంగళవారం ఉమ్మడి జిల్లాల గురుకులాల సిబ్బందికి వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో పది, ఇంటర్ ఉత్తీర్ణతాశాతం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై విజయనగరం, మన్యం జిల్లాలకు చెందిన 13 గురుకులాల ప్రిన్సిపాల్స్, 150 మంది అధ్యాపకులకు వర్క్‌షాప్‌లో అవగాహన కల్పించనున్నారని పేర్కొన్నారు.

వృత్తి విద్యాకోర్సులతో భవిష్యత్

మెరకముడిదాం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యాకోర్సులతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డీవీఎస్ అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. గర్భాం మోడల్ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఆటోమోటివ్, ఐటీ రంగాలపై ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్నామన్నారు. తద్వారా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

22న హుండీల లెక్కింపు

రాజాం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో వేంచేసిన పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయంలోని హుండీలను ఈనెల 22న లెక్కిస్తామని ఆలయ ఈవో మాధవరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ ధర్మకర్తలు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీలను లెక్కింపు చేపడతతామని ఆయన పేర్కొన్నారు.

21 నుంచి ఆధార్ శిబిరాలు

రాజాం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాజాం పరిధిలోని పలు గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీవో శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 21, 22 తేదీల్లో కంచరాం, 23న రాజయ్యపేట, 24న ఎంజె వలస సచివాలయల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నామని తెలిపారు. ఇంతవరకు ఆధార్ కార్డులు లేని 0 నుంచి 6 ఏళ్ల వయస్సు గల పిల్లలకు కొత్త కార్డులు జారీ చేయడం జరుగుతుందని ఎంపీడీవో పేర్కొన్నారు.

అనధికార నిర్మాణాలపై చర్యలు

విజయనగరం రింగురోడ్డు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అనధికార, అక్రమ నిర్మాణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య స్పష్టం చేశారు. సోమవారం బుంగవీధిలోని రహదారిని ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని ప్రణాళిక సిబ్బందిని ఆయన ఆదేశించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టరాదన్నారు. నిబంధనలు బేఖాతర్ చేస్తే ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తెండి

గజపతినగరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్తసంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీవో బి.కల్యాణి ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమావేశమయ్యారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 30 పంచాయతీల్లో ఏర్పాటు చేసిన చెత్తసంపద కేంద్రాలను తక్షణమే వినియోగంలోకి తేవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ సుగుణాకరరావు తదితరులు పాల్గొన్నారు.

వెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా శ్రీలక్ష్మి ప్రమాణ స్వీకారం

జామి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మండలంలోని రామయ్య పాలెం మాజీ సర్పంచ్, టీడీపీ విశాఖ పార్లమెంటరీ మహిళ కార్యదర్శి మాకిరెడ్డి శ్రీలక్ష్మి సోమవారం మంగళగిరిలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ వెలమల సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు.

అభివృద్ధికి సహకరించండి

లక్కవరపుకోట (కొత్తవలస), జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి అందరూ సహకరించాలని ఎమ్మెల్యే లలితకుమారి కోరారు. సోమవారం జరిగిన అభివృద్ధి కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రజలు నిరంతర ఆరోగ్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎన్.గోపమ్మ, సర్పంచ్ మచ్చ రామస్వామి ఉన్నారు.

ప్రతి వినతినీ పరిష్కరించండి

- కలెక్టర్ అంబేడ్కర్
- పీజీఆర్‌ఎస్‌లో 183 వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి వినతినీ పరిష్కరించాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా వినతులను పరిష్కరించాలన్నారు. ప్రతి వినతిని ఎలా పరిష్కరించారన్న దానిపై మూడు దశల్లో తనిఖీ ఉంటుందన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందే రీతిలో పరిష్కరించాలన్నారు. పీజీఆర్‌ఎస్‌లో 183 వినతులు అందాయి. కార్యక్రమంలో జేసీ సేతు మాధవన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, ఆర్‌డీవో కీర్తి తదితరులు ఉన్నారు.

జిరాయితీ భూమికి నకిలీ ధ్రువపత్రాలు..

తమకు వారస్వతంగా వచ్చిన జిరాయితీ భూమికి నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి ఆక్రమించుకున్నారంటూ డెంకాడ మండలం గుణుపూరుపేట గ్రామానికి చెందిన రైతులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గుణుపూరు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 48-4లో ఎకరా 73 సెంట్లు భూమి ఉందని తెలిపారు. భూమిని గుణుపూరుపేట గ్రామానికి చెందిన పైల అప్పల నాయుడు, పైల ఈశ్వరరావు, చిన్న ఈశ్వరరావు, పైల కామేశ్వరరావు, శ్రీనివాసరావు, తివిటి నాయుడులకు వారస్వతంగా వచ్చిందన్నారు. కొందరు రెవెన్యూ అధికారులు కుమ్మక్కై ఈ భూమికి నకిలీ పత్రాలు సృష్టించి భూ ఆక్రమణకు పాల్పడ్డారన్నారు. మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని తెలిపారు. దీనిపై విచారణ చేసిన న్యాయం చేయాలని రైతులు కోరారు.

జీతాలు ఇప్పించండి..

జిల్లాలో పనిచేస్తున్న కార్యకర్తలకు డిసెంబరు నెల జీతాలు అందించే ఏర్పాటు చేయాలని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అంగన్‌వాడీ కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. పీడీ సెలవులో ఉండటం వల్ల జీతాలు అందలేదని, పండగ పూట ఇబ్బంది పడ్డామన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం నాయకులు అనసూయ, పైడిరాజు, లక్ష్మి ఉన్నారు.

తీర్మానాలకు పాలక మండలి బ్రేక్



సమావేశంలో సర్పంచ్ సంతోషికుమారి

శృంగవరపుకోట జనవరి 20 (ఆంధ్రజ్యోతి) శృంగవరపుకోట పంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. పంచాయితీ కార్యనిర్వాహక కార్యదర్శి వీవీ అనురాధ అజెండాలోని పలు అంశాలను ప్రస్తావించారు. పాలక మండలి ప్రవేశ పెట్టిన పలు తీర్మానాలను సభ్యులు ఆమోదించలేదు. ప్రధానంగా పుణ్యగిరి మహాశివరాత్రి జాతరకు అవసరమయ్యే అదనపు పారిశుధ్యం, లైటింగ్, వంటి సదుపాయాల కల్పనకు సాధారణ నిధుల వెచ్చించే విషయంపై చర్చించారు. ఎంత ఖర్చు అవుతుందో చెప్పాలని సభ్యులు అడిగిన ప్రశ్నకు పంచాయితీ అధికారులు సక్రమంగా సమాధానం ఇవ్వలేదు. దాంతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే పంచాయతీ పరిధిలో భవన నిర్మాణ అనుమతులను ఆపాలని సభ్యులు కోరారు. భవన నిర్మాణ అనుమతుల విషయం సభ్యులతో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకోవాలన్నారు. అన్ని సక్రమంగా ఉంటే వచ్చే సమావేశంలో ఆమోదం తెలుపుతామని తేల్చిచెప్పారు. గత సమావేశం నుంచి ఇప్పటి వరకు జరిగిన నిధుల జమ, ఖర్చుల అమోదానికి అభ్యంతరం తెలిపారు. వాటి వివరాలను అందిస్తేనే ఆమోది స్తామన్నారు. సమావేశంలో ఉప సర్పంచ్ మోపాడ కుమార్ ఉన్నారు.

'కాశ్వీ'లో అరుదైన శస్త్రచికిత్స



మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

విజయనగరం రింగురోడ్డు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాశ్వీ ఆసుపత్రిలో రోగి గుండెకు సంబంధించిన అరుదైన శస్త్రచికిత్స నిర్వహించామని ఆసుపత్రి ఎండీ డాక్టర్ మోపాడ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్‌లో ఉన్న ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరానికి చెందిన 74 ఏళ్ల వృద్ధుడు గుండె సంబంధిత సమస్యలతో బాధపడుత ఇటీవల తమ ఆసుపత్రిలో చేరారన్నారు. ఆయనకు పరీక్షలు నిర్వహించగా ఆస్టియో వాల్వ్ స్టెనోసిస్‌తో బాధపడుతున్నారని తేలిందన్నారు. ఎంతో క్లిష్టమైన బైపాస్ సర్జరీ రోగికి చేయాల్సి ఉందని గుర్తించామన్నారు. శస్త్రచికిత్స సమయంలో రక్తం ఎక్కువగా పోవడంతో పాటు శస్త్రచికిత్స తర్వాత ఆయా ప్రాంతాల్లో కోత, కుట్లు పెద్దగా ఉండటంతో అవి మానేందుకు ఎక్కువ రోజులు ఆసుపత్రిలో ఉండాల్సి ఉంటుందన్నారు. అయితే రోగికి కార్డియాలజిస్ట్ డాక్టర్ బొబ్బిలి రవికిశోర్ ఆధ్వర్యంలో అత్యాధునిక ట్రాన్స్ క్యాథెటర్ ఆయోర్టిక్ వాల్ ఇంప్లాంటేషన్ శస్త్రచికిత్స నిర్వహించామన్నారు. దీని ద్వారా రోగి తొడ రక్తనాళం ద్వారా ఒక రకమైన తీగెను పంపించి గుండె కవాటం మార్పిడి చేశామన్నారు. ఈ శస్త్రచికిత్స ద్వారా ఎటువంటి పెద్ద కోతలు, కుట్లు రక్తస్రావం ఉండవని, త్వరగా రోగి కోలుకుని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అవ్వవచ్చునన్నారు. శస్త్ర చికిత్స ఖరీదుతో కూడుకున్నదని, అయినప్పటికీ తక్కువ ధరలో చేశామన్నారు. తమ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు లెంకా శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ డైరక్టరు కర్రోతు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అదితిని కలిసిన మాజీ సైనికులు



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం


విజయనగరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే అదితి గజపతి రాజును మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.ఈశ్వరరావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రం లోని గాజులరేగ రెవెన్యూ సర్వే నెంబరు 1/84, 1/85 సర్వే నెంబర్‌లోని 15 ఎకరాల్లో మాజీ సైనికులు, వితంతువులకు పట్టాలు ఇచ్చినప్పటికీ, నేటికీ సబ్ డివిజన్ కాలేదని ఆమెకు వివరించారు. ఆ భూమిని సబ్ డివిజన్ చేసి అప్పగించే చర్యలు చేపట్టాలని వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సంఘ ప్రతినిధులు బి.వెంకటరావు, సత్యనారాయణ, ఉమామహేశ్వరరావు తదితరులున్నారు.

కుష్ఠు వ్యాధిపై సర్వే

లక్కవరపుకోట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి లక్షణాల గుర్తింపునకు స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది 31 పంచాయతీల్లో ఇంటింటా సర్వే చేస్తున్నారని వైద్యుడు బి.అనీల్‌కుమార్ తెలిపారు. 47 టీములు గ్రామాల్లో పనిచేస్తున్నాయన్నారు.

నిందితుడికి సీఎం రిలీఫ్ ఫండ్ ఇస్తారా?

- అప్పటి కేసులు తప్పైయితే.. అధికారులపై చర్యలు తీసుకోండి..
- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స

విజయనగరం/ దాసన్నపేట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రామతీర్థంలో రాముడి విగ్రహ శిరచ్ఛేదనం చేసిన నిందితుడికి ఎలా సీఎం రిలీఫ్ ఫండ్ ఇచ్చారని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. నేరస్థుడిని ప్రోత్సహిస్తారా అని టీడీపీ నేతలను నిలదీశారు. సోమవారం విజయనగరంలో ఆయన సోదరుడి నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నీతులు చెప్పినవారే నిందితుడికి చెక్ అందించారన్నారు. 'వైసీపీ ప్రభుత్వ హయంలో ఎ-2గా ఉన్న వ్యక్తిపై తప్పుడు కేసులు పెట్టారంటున్నారు.. ఇప్పుడు ప్రభుత్వం మీదే కదా.. ఆ అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని' ప్రశ్నించారు. జైలుకు వెళ్లి వచ్చిన వ్యక్తికి ప్రభుత్వ ధనాన్ని దారాదత్తం చెయ్యటం మంచిదికాదన్నారు. ఇలాంటి చర్యలతో సమాజానికి ఎటువంటి సందేశం ఇస్తున్నారో చెప్పాలన్నారు. అలాగే వ్యవ సాయానికి అవసరమయ్యే ఎరువులు జిల్లాలో అందుబాటులో లేవని, ప్రైవేట్ వ్యాపారులు అధిక ధరలకు అమ్ముతున్నారన్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టిసారించాలన్నారు. తిరుపతి, బుడమేరు ఘటనలు ఖచ్చితంగా ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. ప్రధాని మోదీ విశాఖ పర్యటనలో కూడా స్టీల్‌ప్లాంట్ కోసం ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇటీవల విడుదల చేసిన బకాయిలు పాతవి కాదని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరునెలల బకాయిలని స్పష్టం చేశారు. చంద్రబాబు దావోస్ పర్యటన విజయవంతం కావాలని రాష్ట్రంలో పౌరుడిగా కోరుకుంటున్నానన్నారు. చీపురుపల్లి నియోజకవర్గానికి తానే ఇన్‌చార్జినని, బొత్స సందీప్ డాక్టరుగా బిజీగా ఉన్నారన్నారు.

కనకల మృతి తీరని లోటు



అప్పలనాయుడు(ఫైల్)

విజయనగరం దాసన్నపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అర్బన్ బ్యాంకు మాజీ డైరెక్టర్ కనకల అప్పలనాయుడు మృతి తీరని లోటని జడ్పీ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం కనకల అప్పలనాయుడు భౌతిక కాయాన్ని ఆయన సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకుకు డైరక్టరుగా విశేషమైన సేవలు అందించారన్నారు. పరామర్శించిన వారిలో టీడీపీ నాయకులు పిళ్లా విజయ్‌కుమార్, కాళ్ల గౌరీశంకర్, శిష్టకరణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంపీజీ ఈశ్వరరావుతో పాటు వివిధ పార్టీల నాయకులు ఉన్నారు.

బహుజనుల బాగుకు పనిచేయండి

లక్కవరపుకోట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బహుజనుల బాగు కోసం ప్రతీ ఒక్కరూ పనిచేయాలని రాష్ట్ర బీఎస్పీ సమన్వయకర్త పాడేరు మాజీ ఎమ్మెల్యే ఎల్.రాజారావు పిలుపునిచ్చారు. సోమవారం ఎల్.కోటలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి బోని కృష్ణ ఆధ్వర్యంలో బహుజనుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్.కోట నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్లుగా బోని అచ్యుత రామారావు, కొట్యాడ అప్పారావు, అధ్యక్షుడిగాద దోని అప్పారావు, కార్యదర్శిగా గాలి చైతన్యకుమార్‌లను ఎన్నుకున్నారు.

విద్యార్థులకు సత్కారం

గజపతినగరం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తున్న మండలం లోని తమ్మారాయుడుపేట ప్రాథమిక పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థుల ను ప్రధానోపాధ్యాయుడు కనకళ చంద్రరావు సోమవారం సత్కరించారు. గుడెపు దీప్తి, మంత్రి మనీషా, సింగారపు మేఘన, సారిక యశస్విని, సారిక కార్తీక్‌లను గ్రామ పెద్దలు, పాఠశాల కమిటీ సమక్షంలో ఆయన ప్రశంసించారు.



విద్యార్థులతో హెచ్‌ఎం

పశు వైద్య శిబిరాలను వినియోగించుకోండి



పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



భోగాపురం:శిబిరాన్ని ప్రారంభిస్తున్న బంగార్రాజు

లక్కవరపుకోట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని రైతులందరూ ప్రభుత్వం నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు. సోమవారం జమ్మాదేవిపేటలో నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు మేలు చేయాలనే తపన ఒక్క చంద్రబాబుకే ఉందన్నారు. అనంతరం గ్రామంలో జలజీవన్ మిషన్ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. గ్రామాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ కొట్యాడ ఈశ్వరరావు, వెటర్నరీ ఏడీ గంగాధర్, వైద్యులు గాయత్రి, ఎం.తులసీ, ఎస్.సత్యనారాయణ హాజరయ్యారు.

● భోగాపురం: రైతులు పశు వైద్య శిబిరాలను వినయోగించుకోవాలని మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. రావాడలో సోమవారం పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులు, పశుసంపద అభివృద్ధిపై దృష్టిసారించిందన్నారు. గోకులాలను ఏర్పాటు చేసిందని,ప్రస్తుతం పశువైద్య శిబిరాలను నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో పశు సంవర్థక శాఖ డీడీ దామోదరరావు, ఏడీ మహాపాత్రో, పశు వైద్యులు కమలకుమారి, సర్పంచ్ ఎ.పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆటో, బైక్ ఢీ: పలువురికి గాయాలు

● ఒకరి పరిస్థితి విషమం

క్రైం కార్నర్

పాలకొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆటో, బైకు ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలు కాగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన మండలంలోని పనుకువలస జంక్షన్ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అవలంగి గ్రామానికి చెందిన బాలి వెంకటేష్ వీరఘట్టం నుంచి పాలకొండ వైపు వస్తున్నాడు. పాలకొండ నుంచి వీరఘట్టం వైపు ఆటో వెళ్తోంది. ఈ రెండూ పనుకువలస వద్దకు వచ్చేసరికి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న వారితో పాటు, వెంకటేష్ గాయపడ్డాడు. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వెంకటేష్ పరిస్థితి విషమంగా ఉంది.

మూడు మద్యం దుకాణాలకు తాళాలు



దుకాణానికి తాళం వేయిస్తున్న తహశీల్దార్

జామి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన జామిలో రెండు మద్యం దుకాణాలు, మండలంలోని భీమసింగి ఓ మద్యం దుకాణాన్ని సోమవారం సాయంత్రం తహశీల్దార్ కృష్ణలత మూసివేయించడం సంచలనంగా మారింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సాయంత్రం సమయంలో మద్యం దుకాణాల వద్దకు తహశీల్దార్ వెళ్లారు. ఇక్కడ బహిరంగంగా మద్యం సేవిస్తుడటం వల్ల ప్రజలు అవస్థలు పడుతున్నారని, రోజూ గొడవలతో ఇబ్బందిగా ఉందని పలువురు ఫిర్యాదులు చేశారని దుకాణ నిర్వాహకులకు తెలిపారు. ఈ పరిస్థితి మారాలని వారికి సూచించారు. అయితే ఏమి జరిగిందో తెలియదు కానీ మద్యం దుకాణాలకు తాళాలు వేయించారు. దీంతో స్థానికులు ఆశ్చర్యపోయారు. అసలు ఏం జరిగిందో తెలుసుకునే లోపు తహశీల్దార్ అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఈ విషయంపై వారు ఎస్‌ఈబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు జామి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. ఈవిషయంపై తహశీల్దార్ కృష్ణలతను వివరణ కోరగా ఈ మద్యం దుకాణాల వద్ద బహిరంగంగా మద్యం సేవించడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనే ఫిర్యాదులు రావడంతో వారికి పలుమార్లు చెప్పామని, వారిలో మార్పు రాకపోవడంతో దుకాణాలకు తాళాలు వేయించామన్నారు. ఇదే విషయంపై పలువురు ఎస్‌ఈబీ అధికారులు మాట్లాడుతూ ప్రజలు ఇబ్బందులు పడుతుంటే తహశీల్దార్, స్థానిక పోలీసులు, ఎస్‌ఈబీ అధికారులకు ఫిర్యాదు చేయాలి కానీ ఇలా మూయించే అధికారం లేదన్నారు. దుకాణాలు మూయించే అధికారం కలెక్టర్, ఎస్‌ఈబీ సూపరింటెండెంట్‌కు మాత్రమే ఉందని వారంటున్నారు. దుకాణాలను తెరిపించి, శాంతిభద్రతల సమస్య లేకుండా పోలీసుల సహకారం తీసుకుంటామని ఎస్‌ఈబీ సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

శృంగవరపుకోట రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం పంచాయతీ సన్యాసయ్యపాలెం గ్రామానికి చెందిన బర్ల సత్యవమ్మ (85) విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ నారాయణమూర్తి తెలిపారు. ఈవిషయంపై సోమవారం సీఐ తెలిపిన వివరా లు ఇలా ఉన్నాయి. ఈనెల 16న వృద్ధురాలు గ్రామంలోని బంగారమ్మ తల్లి ఆలయానికి వెళ్లిందన్నారు. గుడిలో ఆమె చీరకు దీపం వల్ల నిప్పంటుకుందన్నారు. కాళ్లు, చేతులు, వీపు కాలిపోయిందన్నారు. వెంటనే ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారని, అక్కడ నుంచి కేజీహెచ్‌కు వైద్యులు రిఫర్ చేశారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మరణించిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చీపురుపల్లిలో చోరీ

చీపురుపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లెక్చరర్స్ కాలనీలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. విశ్రాంత ఉపాధ్యాయుడు పెద్ది మహేష్ ఇంటి తాళాలు పగలగొట్టి దొంగలు ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలో దాచి ఉంచిన 7 గ్రాముల బంగారం, 1.350 కేజీల వెండి వస్తువులను అపహరించారు. అంతకు ముందు అదే కాలనీలోని రామకృష్ణారెడ్డి, అరవిందో అపార్ట్‌మెంట్స్‌లో బొత్స శ్రీహరిరావు ఇళ్లల్లో కూడా తాళాలు విరగ్గొట్టి దొంగలు ఇళ్లలోకి చొరబడ్డారు. రెండు ఇళ్లల్లో ఏమీ లభించకపోవడంతో ఇంట్లోని వస్తువులను చిందరవందర చేసి వదిలేశారు. చోరీ సమాచారం అందుకున్న ఎస్ఐ ఎల్.దామోదరరావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ బృందం ఆధారాలను సేకరించింది. కేసు నమోదు చేశారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్టు

లక్కవరపుకోట (వేపాడ), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరిగిపాలెంలో సోమవారం కోడి పందేల శిబిరం ఎస్ఐ బి.దేవి, సిబ్బంది దాడి చేశారు. దాడిలో ఏడుగురిని అరెస్టు చేశామని ఏడు సెల్‌ఫోన్లు, 8 వాహనాలు, రూ.10, 650లను సీజ్ చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి



రాముడమ్మ (ఫైల్)

గుర్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో రాగోలు గ్రామానికి చెందిన దిండి రాముడమ్మ (110) సోమవారం రాత్రి మృతిచెందారు. ఆమె భర్త రామన్నదొర చనిపోయి 35 సంవత్సరాలు అయింది. ఈమెకు ముగ్గురు మగ పిల్లలు, ఇద్దరు ఆడపిల్లలున్నారు. వారందరూ మనుమలు, మరవరాళ్లతో కుటుంబాలతో ఉంటున్నారు. ఇప్పటివరకు కంటిచూపు గానీ ఇతర ఆరోగ్య సమస్యలు గానీ ఆమెకు పెద్దగా లేవు. సాధారణ ఆహార పదార్థాలు మాత్రమే ఆమె తీసుకునేవారని కుటుంబ సభ్యులు తెలిపారు.

వైస్ ఎంపీపీ పదవికి రాజీనామా

భోగాపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): భోగాపురం వైస్ ఎంపీపీ పదవికి పడాల సత్యవతి రాజీనామా చేసినట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో కె.గాయిత్రి సోమవారం తెలిపారు. పడాల సత్యవతి గత ఎంపీటీసీ ఎన్నికల్లో ఆమె టీడీపీ తరఫున పోటీ చేసి ఎంపీటీసీ సభ్యురాలిగా గెలుపొందారు. మండల అధ్యక్ష ఎన్నికలో ఆమె పాల్గొనలేదు. అనంతరం వైసీపీ మద్దతుదారులతో కలవడంతో ఆమెకు వైస్ ఎంపీపీ పదవి దక్కింది. ప్రస్తుతం ఆమె వైస్ ఎంపీపీకి పదవికి రాజీనామా చేయడం చర్చనీయాంశమైంది.

విద్యుత్ సౌకర్యం కల్పించండి

శృంగవరపుకోట రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం పెంటవీధి కళ్లాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని టీడీపీ నాయకుడు లగుడు తిరుపతి ఆధ్వర్యంలో రైతులు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి కలిసి వినతిపత్రం అందించారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందించారు.

మత్తు వదలరా?

(ఐదో పేజీ తరువాయి)

ఆస్వాదించేందుకు చూస్తున్నారు. రవాణా సమయంలో దీన్ని తాగేందుకు కొంత దాచుకుంటున్నారు. తమతో స్నేహంగా వుండే ఇతర మత్తుపదార్థాల అలవాటు వున్నవారికి అందిస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు గంజాయి రవాణాను చూసీచూడనట్లు వదిలేసింది. 2019 నుంచి 2023 వరకు పోలీసు రికార్డులను ఓ సారి పరిశీలిస్తే 200 కేసుల్లో రూ.813.93 లక్షల విలువైన 23,933 కేజీల గంజాయి పట్టుబడింది. 275 మంది వరకు కోర్టుకు తరలించారు. ఏటా 2,500 కేజీల నుంచి 9,700 కేజీల వరకు పోలీస్‌లకు చిక్కింది. గంజాయి స్మగ్లర్ల మధ్య ఏర్పడిన గొడవల కారణంగా వారి నుంచి వచ్చిన సమాచారంతో పట్టుకోవడం తప్ప పోలీస్ నిఘా పెట్టిందేమీ లేదు. దీన్ని బట్టి అప్పట్లో గంజాయి ఏ స్థాయిలో రవాణా జరిగిందో అర్థం చేసుకోవచ్చు. ఒడిశా సరహద్దుల నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా మీదుగా ఈ గంజాయి జిల్లాలో రవాణా జరుగుతున్న విషయం తెలిసిందే. ఒకప్పుడు అల్లూరి జిల్లాకు చెందిన యువతకు మాత్రమే గంజాయి వ్యాపారులు సహకరించేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత జిల్లాకు చెందిన యువత చూపు అటు వైపు మళ్లింది. రవాణాకు సహకారం అందించడంతో పాటు కొంత గంజాయిని దగ్గర వుంచుకుంటున్నారు. తాము తాగుతూ మిగిలిన వారికి అలవాటు చేసే ప్రయత్నం చేయడం ద్వారా లాభపడాలనుకుంటున్నారు.

ప్రస్తుతం అధికారంలో వున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం గంజాయి రవాణాపై గట్టి నిఘా పెట్టింది. ఈ రవాణాను అడ్డుకోవడంతో పాటు గంజాయి సాగే లేకుండా ప్రయత్నాలు చేస్తోంది. అల్లూరి జిల్లాలో సాగు చేస్తున్న గంజాయిని ధ్వంసం చేస్తోంది. గంజాయి సాగుకు బదులు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తోంది. వినని వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రయత్నాలు కొంత సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఎస్పీ వకూల్‌జిందాల్ గంజాయి రవాణా అడ్డుకట్టకు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. అయితే పీల్చేందుకు అలవాటు పడిన యువత మాత్రం చాటుమాటుగా పని కానిచ్చేస్తున్నారు.

డీఎస్పీ శ్రీనివాసరావుకు వీడ్కోలు

బొబ్బిలి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి డీఎస్పీగా పి.శ్రీనివాసరావు ప్రజల మన్నన పొందారని రోటరీ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ జేసీ రాజు అన్నారు. బొబ్బిలి నుంచి నర్సీపట్నం బదిలీపై వెళ్తున్న శ్రీనివాసరావుకు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. కొత్తగా ఇక్కడ బాధ్యతలు స్వీకరించిన భవ్యారెడ్డికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు గెంబలి శ్రీనివాసరావు, శ్రీహరి, నాగరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో మౌనిక ప్రతిభ



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన మౌనిక

రామభద్రపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అండర్-19 సాఫ్ట్‌బాల్ పోటీలకు కొట్టక్కి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన రొంగలి మౌనిక ఎంపికైనట్టు పీడీ బొత్స రత్నకిశోర్ సోమవారం తెలిపారు. మహారాష్ట్రలో ఈనెల 24 నుంచి 27 వరకు జరగనున్న ఈ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి 16 మంది వెళ్తుండగా, ఈ జట్టులో మౌనిక ఉందని తెలిపారు. ఈసందర్భంగా మౌనికను హెచ్‌ఎం భాస్కరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష

బాడంగి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేయాల్సిన పని దినాలు 7 లక్షలకుపైగా ఉన్నాయని, కావున లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. ప్రతి పంచాయతీలో 250 మందికి పని కల్పించాలన్నారు. అలాగే హౌసింగ్ పని దినాలను కూడా పూర్తిచేయాలని సూచించారు. వేతనదారులు రూ.300 వేతనం పొందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో, ఈసీ, పలువురు టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ట్రెండ్స్ ఇన్ మేథమెటిక్స్‌పై సెమినార్

విజయనగరం రూరల్, జనవరి 20 ఆంధ్రజ్యోతి): మహారాజా స్వయం ప్రతిపత్తి కళాశాలలోని గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈనెల 31, ఫిబ్రవరి 1 తేదీల్లో ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సహకారంతో ట్రెండ్స్ ఇన్ మేథమెటిక్స్‌పై అధ్యాపకులకు ప్రత్యేక సెమినార్ నిర్వహిస్తామని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సాంబశివరావు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను కళాశాలలోని సెమినార్ భవనంలో గణితశాస్త్ర అధ్యాపకులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గణితశాస్త్ర విభాగాధిపతి ఎస్.నూరిబాబు, అధ్యాపకులు సీఎస్‌కే ఉమాశంకర్, బి.జ్యోతి, ఎం.స్వామినాయుడు, టి.స్వాతి, డి.రమేష్, టి.శ్రీదేవి, ఎంవీ లక్ష్మీ, డాక్టరు పి.అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

ఇన్నోవేషన్ కేంద్రం ప్రారంభం

విజయనగరం రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ గురజాడలో సోమవారం స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్నోవేషన్ కేంద్రాన్ని ఆ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కేంద్రాన్ని విద్యార్థులు శతశాతం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే.. వర్సిటీ సమావేశ భవనంలో సెమినార్‌ని నిర్వహించారు.

జనసేనలో చేరిక



పార్టీలోకి చేరిన వారిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): భోగాపురం జడ్పీటీసీ మాజీ సభ్యురాలు పడాల రాజేశ్వరి, మాజీ వైస్ ఎంపీపీ పడాల సత్యవతితో కలిసి పలువురు వైసీపీకి చెందిన వారు సోమవారం ముంజేరు జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు. జనసేనలో చేరిన వారిలో పడాల శ్రీనివాసరావు, పడాల సూర్యనారాయణ, ఎ.వెంకటరావు, డెంకాడ మండలం పేడాడకు చెందిన మెండి సురేష్, మెండి జగదీశ్ తదితరులున్నారు.

విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

చీపురుపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలందేలా సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఈపీడీసీఎస్ విజయనగరం ఎస్ఈ ముప్పల లక్ష్మణరావు కోరారు. సోమవారం చీపురుపల్లిలో విద్యుత్ ఉద్యోగులు, అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఈసీఎస్ పరిధిలోని వినియోగదారులకు ఉత్తమ సేవలందించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విజయనగరం పట్టణ డివిజన్ ఈఈ పి.త్రినాథరావు, ఆర్ఈసీఎస్ డీఈ బీవీ రమణ, మూడు మండలాల ఏఈలు పాల్గొన్నారు.

12వ డివిజన్‌లో కమిషనర్ పర్యటన

విజయనగరం రింగురోడ్డు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య సోమవారం 12వ డివిజన్‌లో పర్యటించారు, స్థానిక సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, కార్పొరేటర్ రేగాన రూపాదేవి తదితరులు పాల్గొన్నారు.

● నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రెవెన్యూ విభాగానికి సంబంధించి ఒక వినతి వచ్చింది. కమిషనర్ నల్లనయ్య వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డా.సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీప్లానర్ హరిబాబు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

● మంత్రి సంధ్యారాణి

● సాలూరు మున్సిపల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

సాలూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఆమె అధ్వర్యంలో ప్రజా సమస్యలు పరిష్కార వేదిక నిర్వహించారు. పట్టణంలో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ అద్దెల విషయంలో అధికారులు పట్టించుకోవటం లేదని, అదనంగా జీఎస్టీ వసూలు చేస్తున్నారని ఒకరు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. తక్షణం సమస్య పరిష్కారించాలని ఆమె అధికారులను ఆదేశించారు. పారన్నవలసలో ఆర్వో ఎఫ్ఆర్ భూమి లేదని, అయితే ఇద్దరి పేరున నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని మంజూరు చేశారని, ఆ భూమిని కొంతమంది రాజకీయ నాయకులు అనుభవిస్తున్నారని మాజీ ఏఎంసీ వైస్‌ఛైర్మన్ చొక్కాపు త్రినాథ మంత్రి దృష్టికి తెచ్చారు. దీనిపై



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న మంత్రి

విచారణ చేయాలని ఆమె రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. అలాగే తాగునీరు, పింఛన్లు, టిడ్కో ఇళ్లు, భూ కబ్జా, పార్కింగ్ లేని షాపింగ్‌మాల్స్. ఇలా అనే సమస్యలపై సుమారు 139 వినతులు అందాయి. వీటిపై మంత్రి స్పందించి, తక్షణమే సమస్యలు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 25 వినతులు

సీతంపేట రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం పీహెచ్‌వో వెంకటగణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 25 వినతులు వచ్చాయి. వీరఘట్టం మండలంలో హుస్సెనుపురం సచివాలయం నుంచి గదబవలస మీదుగా కత్తులకవిటి గ్రామం వరకు బీటీ రహదారి నిర్మించాలని రాయల కృష్ణ కోరారు. వడ్డంగి ఎంపీపీఎస్ పాఠశాలలో మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మించాలని పాలక చౌదరి కోరగా నల్లరాయిగూడ గ్రామంలో వీధి కాలువలు నిర్మించాలని బిడ్డిక దివాకర్ కోరారు. ఇలా అనేక సమస్యల పరిష్కారం కోరుతూ పీజీఆర్ఎస్‌కు గిరిజనుల నుంచి వినతులు వచ్చాయి. డీడీ అన్నదొర, టీడబ్ల్యూ ఇంజినీరింగ్ ఈఈ పి.రమాదేవి, ఐకేపీ ఏపీడీ సన్యాసిరావు, ఏటీడబ్ల్యువో మంగవేణి, ఏఎంవో కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరం పరిష్కరించాలి

● ఏఎస్పీ దిలీప్ కిరణ్

బెలగాం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదులను సత్వరం పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఏఎస్పీ ఓ.దిలీప్ కిరణ్ ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా కార్యాలయంలో ఏఎస్పీ ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. పీజీఆర్ఎస్‌లో 5 ఫిర్యాదులు అందినట్టు ఏఎస్పీ తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఏఎస్పీ స్వయంగా మాట్లాడి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దర్యాప్తు చేపట్టి బాధితులకు తగిన న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. నకిలీ పత్రాలు, అత్తారింటి వేధింపులు, అధిక వడ్డీలు, భూ వివాదాలు, సైబర్‌క్రైం తదితర అంశాలపై ఎక్కువగా ఫిర్యాదులు అందినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఫ్రకృద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఏఎస్పీ దిలీప్‌కిరణ్

పీజీఆర్ఎస్‌కు 68 వినతులు



వినతులు స్వీకరిస్తున్న ప్రత్యేక ఉప కలెక్టర్ ధర్మాచంద్రారెడ్డి

పార్వతీపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 68 వినతులు వచ్చాయని, వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని కేఆర్ఆర్సీ ప్రత్యేక ఉపకలెక్టర్ పి.ధర్మ చంద్రారెడ్డి జిల్లా అధికారులను కోరారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఆయన పాల్గొని, అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు, ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహన్‌రావు, డీపీవో టి.కొండలరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎల్.రమేష్, జిల్లా మత్స్యశాఖాధికారి వి.తిరుపతయ్య, జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం కార్య నిర్వాహక ఇంజినీర్ ఓ.ప్రభాకరరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి నగేష్‌బాబు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలు ప్రారంభం



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): లక్కగూడ గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సోమవారం ప్రారంభించారు. ఈ శిబిరాలను ఈనెల 20 నుంచి 31 వరకు నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్థక శాఖ జేడీ మన్మథరావు, సర్పంచ్ సూర్యారావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు, స్థానిక నాయకులు కడ్రక కళావతి, పశు వైద్యాధికారి లక్ష్మణరావు, పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా అన్నదానం

● ప్రతి సోమవారం అన్న క్యాంటీన్ నిర్వహణ



పేదలకు ఆహార పొట్లాలు అందజేస్తున్న ప్రసాద్‌బాబు

సాలూరు / పాచిపెంట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పాచిపెంటలో ప్రతి సోమవారం అన్న క్యాంటీన్ పేరిట అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం 200 మంది పేదలకు అన్నదానం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి.సంతోషి పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచండి

కురుపాం, జనవరి20 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కె.నాగేశ్వరరావు, ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి అన్నారు. సోమవారం స్థానిక గాంధీనగర్ వీధిలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వాటర్ ట్యాంకు చుట్టూ చెత్తా చెదారం పోయడం వల్ల ప్రజలు అనేక రోగాలు బారిన పడే అవకాశం ఉందన్నారు. ట్యాంకు పరిసరాలను పరిశుభ్రం చేయాలని, వీధిలో పైపులైన్ లీకేజీ పనులను త్వరగా పూర్తిచేయాలని పంచాయతీ ఇన్‌చార్జి ఈవో జగదీష్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కార్తీక్, ఎంఎల్‌హెచ్‌పీ ప్రత్యూష, సచివాలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా శాలివాహన కులవృత్తుల పండగ

బొబ్బిలి రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగరాయపురం, పెంట గ్రామాల్లో సోమవారం శాలివాహన కులవృత్తుల కుమ్మరి వారు కుండలు తయారు చేసే ప్రారంభ పండగను నిర్వహించారు. ఉగాది పండగ లాగానే వారు కూడా ప్రతి సంవత్సరం ఈ రోజు వారి కులవృత్తి పండగను కుమ్మరి చక్రాన్ని తిప్పి ప్రారంభిస్తారు. కుమ్మరి చక్రంపై కుండలు, ప్రమిదలు తయారు చేస్తారు.

కుష్ఠు వ్యాధిపై సర్వే

బలిజిపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): బలిజిపేట పీహెచ్‌సీ పరిధిలో ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2 వరకు కుష్ఠు వ్యాధిపై సర్వే నిర్వహిస్తామని వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి తెలిపారు. బలిజిపేటలో నిర్వహిస్తున్న సర్వేను ఆమె సోమవారం పరిశీలించారు. ఆశాలకు, వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. చిలకలపల్లి లెప్రసీ ఏఈపీఎం మూర్తి, ఎంపీహెచ్‌ఈవో కర్త, పీహెచ్‌ఎన్ చంద్రావతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

కురుపాం రూరల్, జనవరి20 (ఆంధ్రజ్యోతి): జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా సోమవారం నీలకంఠాపురం పీహెచ్‌సీ ఆవరణలో వైద్యాధికారి పి.అభినవకుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటి సర్వే చేపట్టి వాధిగ్రస్థులను గుర్తించి, తగు చికిత్సలు అందిస్తామంటూ ఆయన తెలిపారు. నీలకంఠాపురం సర్పంచ్ అడ్డాకుల మన్మథరావు, హెచ్ఎస్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సర్వే పరిశీలన

పార్వతీపురం రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంఆర్‌నగరం, చిన్నబొండపల్లి తదితర గ్రామాల్లో సోమవారం కుష్ఠు వ్యాధిపై నిర్వహించిన సర్వేను వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహన్‌రావు పరిశీలించారు. సర్వేను విజయవంతంగా నిర్వహించాలని వైద్యులకు, వైద్య సిబ్బందికి సూచించారు. సూపర్‌వైజర్లు సత్తిబాబు, జైలక్ష్మీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలో దిగువ బుడగరాయి, రేగులగూడ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సీడీపీవో రంగలక్ష్మి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా స్థానిక ఐసీడీఎస్ కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. ఇతర వివరాల కోసం ఐసీడీఎస్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చునని సూచించారు.

చుక్కవానివలస కేంద్రానికి..

పార్వతీపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మండలం చుక్కవానివలస అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టు భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్టు శిశు సంక్షేమ పథక సంచాలకుడు బి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక స్థిర నివాసం ఉండి ఎస్టీ కులానికి చెంది పదో తరగతి ఉత్తీర్ణత పొంది 21 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉన్న వివాహిత మహిళా ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈనెల 20 నుంచి 27వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా పార్వతీపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందించాలన్నారు.

రెయ్యివానివలసకు కేంద్రం మంజూరు

సాలూరు రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సాలూరు మండలం రెయ్యివానివలసకు పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా కొత్తగా అంగన్‌వాడీ కేంద్రం మంజూరైందని సీడీపీవో విజయలక్ష్మి చెప్పారు. ఆమె సోమవారం విలేకర్లతో మాట్లాడారు. కొత్తగా మంజూరైన అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త నియమాకానికి ఈనెల 27న అర్హులైన ఎస్టీ వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పాత భవనం వద్దే కార్యాలయం నిర్మించాలి

పాలకొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జల వనరుల శాఖ సబ్ డివిజనల్ కార్యాలయం ప్రస్తుత పాత కార్యాలయం వద్ద ఏర్పాటు చేస్తే రైతులకు, అధికారులకు అందుబాటులో ఉంటుందని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు. వెలగవాడ వద్ద కార్యాలయం నిర్మించబోయే స్థలాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయ నిర్మాణానికి సుమారు కోటి రూపాయలు ఖర్చు అవుతుందన్నారు. పనులు కూడా ప్రారంభించనున్నారన్నారు. జాతీయ రహదారి విజయనగరం నుంచి హడ్డుబంగి వరకు నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం జరిగితే సబ్ డివిజనల్ కార్యాలయ స్థలం సగభాగం తెగిపోయే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. వెలగవాడ వద్ద ఏర్పాటు చేస్తున్న కార్యాలయ పనులను నిలుపుదల చేసి ప్రస్తుత పాత కార్యాలయం చోటే విశాలమైన స్థలం ఉన్నందున కొత్త కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుడివాడ నీటి సంఘం డైరెక్టర్ పామోటి వైకుంఠరావు, దుప్పాడ చిన్నంనాయుడు, రైతులు ఉప్పాడ రాము, దుప్పాడ చిన్న తదితరులు పాల్గొన్నారు.

కూలీల ఇష్టంతోనే మేట్ల నియామకం

జియ్యమ్మవలస, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధి మేట్ల నియామకం గ్రూపు కూలీల ఇష్టం మేరకే జరగాలని ఎంపీడీవో శంబంగి రమేష్ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఏపీవో కె.శ్రీనివాసరావుతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. మేట్ల నియామకం గ్రూపు కూలీల ఇష్టం మేరకే జరగాలన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఏడాదిలో 25 రోజులు పనిచేయాలని, 50 ఏళ్ల వయసు ఉండాలని, సొంత సెల్‌ఫోన్ కలిగి దాని ఆపరేటింగ్ చేయడం రావాలని చెప్పారు. సోమవారం నుంచే పనులు ప్రారంభమయ్యాయన్నారు. ఫారంపాండ్స్, వ్యక్తిగత సోక్ పిట్లు, కంపోస్ట్ సోక్ పిట్లు, చేపల చెరువులు, రూఫ్ వాటర్ హార్వేస్టింగ్ సిస్టం, అమృత సరోవర్ ట్యాంకుల నిర్మాణం పనులు రూ.48 కోట్లతో చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేసి ఉంచామని చెప్పారు. ఎంపీడీవో కార్యాలయ పర్యవేక్షకుడు కె.రామారావు ఉన్నారు.

పంచాయతీ భవనాల నిర్మాణానికి చర్యలు

గరుగుబిల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో పంచాయతీ భవనాల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని మండల పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాలరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 25 పంచాయతీలకు సంబంధించి 17 పంచాయతీల్లో భవనాలు ఉన్నాయని, 8 పంచాయతీల్లో స్థల సమస్య కారణంగా భవనాల నిర్మాణం జరగలేదన్నారు. బీవీ పురం, చిలకాం, దళాయివలస, కొంకడివరం, కొత్తపల్లి, లఖనాపురం, మరుపెంట, పెదగుడ బ పంచాయతీల్లో నిర్మాణాలు చేపట్టేందుకు అవసరమైన స్థలాలను గుర్తించామని చెప్పారు. స్థలానికి సంబంధించి తహసీల్దార్ పి.బాల దృష్టికి తీసుకువెళ్లగా అవసరమైన స్థలాలను కేటాయించారని చెప్పారు. నిర్మాణా లకు ఉన్నతాధికారుల అనుమతులు మంజూరు కాగానే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.

న్యూస్ బాక్స్

ఢిల్లీ సదస్సుకు కలెక్టర్, ఐటీడీఏ పీవోలు

పార్వతీపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగే జాతీయ సదస్సుకు జిల్లా నుంచి కలెక్టర్ శ్యాంప్రసాద్, పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ పీవోలు అశుతోష్ శ్రీవాస్తవ, యశ్వంత్‌కుమార్‌రెడ్డి సోమవారం వెళ్లారు. మినిస్ట్రీ ఆఫ్ ట్రైబుల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు జిల్లా నుంచి వీరు వెళ్లారు.

బెల్లపు ఊట ధ్వంసం

సీతంపేట రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మల్లమ్మతల్లిగూడ కొండ ప్రాంతంలో ఎస్ఐ వై.అమ్మన్నరావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన దాడుల్లో 1800లీటర్ల బెల్లపు ఊటలను గుర్తించి ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొప్పల వెలమ డైరెక్టర్‌గా మధుసూదనరావు

గరుగుబిల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కొప్పల వెలమ వెల్ఫేర్ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా అక్కేన మధుసూదనరావు ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం విజయవాడలోని బీసీ భవన్‌లో మధుసూదనరావుతో ఉన్నతాధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు.

భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వే

గరుగుబిల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తహసీల్దార్ పి.బాల తెలిపారు. మండలంలో సోమవారం తొలి విడతగా దళాయివలసలో రీసర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతుల సమక్షంలో సర్వే నిర్వహించారు. ఆర్ఐ శ్రీనివాస్ గౌరీప్రసాద్, వీఆర్వోలు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యార్థం బోరు ఏర్పాటు

మక్కువ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): శంబర పోలమాంబ అమ్మవారి ఆలయం వనం గుడి వద్ద భక్తులకు తాగునీటి సౌకర్యం కోసం గ్రామానికి చెందిన నైదాన తిరుపతిరావు తన సొంత నిధులతో తాగునీటి బోరును ఏర్పాటు చేశారు. నైదాన సూర్యయాదవ్, మద్ది రాము తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పరిశీలన

రామభద్రపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక రోగులు, మంచం పట్టిన రోగులకు ఇస్తున్న పింఛన్లపై పరిశీలనకు మండలంలో సోమవారం ప్రత్యేక వైద్య బృందం పర్యటించింది. మండలంలోని ఎనిమిది గ్రామాల్లో 12 మంది లబ్ధిదారులు ఉండగా, వైద్య బృందం వారి ఇళ్లకు వెళ్లి పరిశీలించింది. ఈ పరిశీలనలో ఎంపీడీవో రత్నం, ఆరికతోట, రామభద్రపురం పీహెచ్‌సీల వైద్యాధికారులు దీపక్, దిలీప్‌కుమార్, నాయుడువలస, బూసాయవలస కార్యదర్శులు అడపా ఈశ్వరరావు, ఆకుల ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోండి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

బొబ్బిలి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రామభద్రపురం మండలం కొట్టక్కి గ్రామంలో సర్వే నెం.537లో గల సుమారు 30 ఎకరాల భూముల్లో పాగా వేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2006-07లో 65 మంది పేదలకు ఒక్కొక్కరికి ఎకరా భూమి చొప్పున ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. ఇందులో సుమారు 30 ఎకరాల భూమిని సాలూరు పట్టణానికి రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల దంపతులు బినామీ పేర్లతో అనుభవిస్తున్నారన్నారు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుని, పేదలకు భూములను అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆ భూముల్లో ఎర్రజెండాలను ఎగరేసి తామే పేదలకు పంపిణీ చేస్తామన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న, బొబ్బిలి సీపీఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

'హైడ్రో పవర్' అనుమతులు రద్దు చేయాలి

సాలూరు రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సాలూరు మండలం కురుకూటి వద్ద హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులను రద్దు చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. కురుకూటి పవర్ ప్రాజెక్ట్ ప్రతిపాదిత స్థలాన్ని సీపీఎం నాయకుడు మర్రి శ్రీనివాసరావుతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ ప్రాజెక్ట్ వల్ల వందలాది ఎకరాల సాగు భూమికి నష్టం వాటిల్లుతుందని, ఏడు గిరిజన గ్రామాలు ఉనికి కోల్పోవలసి వస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ అనుమతులను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాముడు శంకరరావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.